సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



దివ్యాంగులకు బాసట
దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేలా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ప్రభుత్వం పరికరాలు అందిస్తోంది.
8లో ▸



కోకో విస్తీర్ణం పెరగాలి
కోకో విస్తీర్ణం పెంపు లక్ష్యంగా ఉద్యాన వర్సిటీలో దక్షిణాది రాష్ట్రాల అధికారుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది.
8లో ▸

శ్రీనివాసుడి కల్యాణోత్సవాలు
ద్వారకాతిరుమల చినవెంకన్న ఉపాలయం లక్ష్మీపురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవాలను ఈనెల 12 నుంచి నిర్వహించనున్నారు.
8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం)	సహరి (బుధవారం వేకువజాము)
భీమవరం	6.24	4.35
తాడేపల్లిగూడెం	6.26	4.44
నరసాపురం	6.26	4.43

న్యూస్‌రీల్

కమనీయం.. రఘునాథుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో రఘునాథస్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కన్నులపండువగా జరిగింది. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన కల్యాణం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఇక్కడ శ్రీరామనవమి అనంతరం మూడో రోజైన ద్వాదశి నాడు కల్యాణం జరిపించడం ఆనవాయితీ. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, బాపులపాడు మండలాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. 14వ శతాబ్దానికి చెందిన రఘునాథస్వామి ఆలయానికి పురాతన చరిత్ర ఉంది. భక్తులు గ్రామస్తులు, ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు. ఆలయ ఈఓ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రూరల్ సీఐ ఆర్.అంకబాబు నేతృత్వంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఉచిత సీట్లకు 10 వరకు అవకాశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యాహక్కు చట్టం ప్రకారం 2023–24లో జిల్లాలోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లలో పేద పిల్లలకు 1వ తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 10 వరకు అవకాశం ఉందని డీఈఓ ఎస్‌వీ రవిసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. 25 శాతం సీట్లలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన (అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులు) వారి కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీనవర్గాలకు (బీసీ, మైనార్టీ, ఓసీ) చెందిన పిల్లలకు 6 శాతం కేటాయించాలని సూచించారు. 2023 జూన్ 1వ తేదీ నాటికి ఐదేళ్లు నిండిన పిల్లలు అర్హులని, ఇప్పటివరకూ జిల్లాలోని 352 పాఠశాలల్లో 178 మంది విద్యార్థులు మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. దీనికి సంబంధించిన అనుమానాల నివృత్తికి తమ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య సెల్ 9505644555లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

దూరవిద్య పరీక్షలు ప్రశాంతం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తెలుగు పరీక్షలకు ఇంటర్ విద్యార్థులు 17 కేంద్రాల్లో 2,056 మందికి 1,895 మంది, పదో తరగతి విద్యార్థులు 6 కేంద్రాల్లో 898 మందికి 827 మంది హాజరయ్యారని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎల్.శ్రీకాంత్ తెలిపారు.

పంట సొమ్ము కోసం రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న చాట్రాయి మండల రైతులు

ఏలూరు (టూటౌన్): తమ వద్ద ధాన్యం కొనుగోలు చేసి ఏడాది కావస్తున్నా సొమ్ములు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని చాట్రాయి మండలం జనార్దనవరం, ఆరుగొలనుపేట, చనుబండ గ్రామాల పలువురు రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. గతేడాది రబీ సీజన్‌లో తాము పండించిన ధాన్యం, మొక్కజొన్నను ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన బోడంపూడి కిషోర్ అనే వ్యాపారికి విక్రయించగా.. పది రోజుల్లో సొమ్ములు ఇస్తానని చెప్పి ఇప్పటివరకూ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, తమకు న్యాయం చేయాలని వాపోయారు. అనంతరం కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామాల రైతులు ఫిరంగి వెంకటేశ్వరరావు, బి.లక్ష్మయ్య, కంచు బంగారయ్య, జి.మల్లేశ్వరరావు, కడగంచు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పదింతల ఉత్సాహంతో..

● టెన్త్ పరీక్షలు ప్రారంభం ● తొలిరోజు 98.35 శాతం హాజరు

సాక్షి, భీమవరం: జిల్లావ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. కేంద్రాల వద్దకు విద్యార్థులకు పరీక్ష సమయం కంటే ముందుగానే చేరుకున్నారు. అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. తొలిరోజు జిల్లాలోని 121 పరీక్షా కేంద్రాల్లో 21,380 మంది విద్యార్థులకు 21,027 మంది హాజరయ్యారు. మొత్తంగా 98.35 శాతం హాజరు నమోదైంది. కలెక్టర్ పి.ప్రశాంతి భీమవరం సెయింట్ మేరీస్ స్కూల్ కేంద్రంతో పాటు మరో రెండు కేంద్రాలను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్‌తో సహా మొత్తం 42 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు. తొలిరోజు పరీక్షలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు.



తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో రూమ్ నంబర్లు సరిచూసుకుంటున్న విద్యార్థులు




భీమవరంలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, డీఈఓ



భీమవరంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తొలి వసంతం.. ప్రగతి పథం

- కొత్త జిల్లాలో ప్రగతి పరుగులు
- ప్రజలకు చేరువలో సేవలు
- అందుబాటులో అధికారులు
- సుపరిపాలనకు మార్గం సుగమం
- జిల్లాల విభజనకు ఏడాది పూర్తి



భీమవరం కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు



భగ్గేశ్వరంలో ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణ పనులు

సాక్షి, భీమవరం/భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా జిల్లాలను విభజించారు. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిని భీమవరం కేంద్రంగా నూతన పశ్చిమగోదావరి జిల్లా ఏర్పాటుచేశారు. గతేడాది ఏప్రిల్ 4న కొత్త జిల్లా కేంద్రం నుంచి పాలన ప్రారంభం కాగా మంగళవారానికి ఏడాది పూర్తికానుంది. ప్రజలకు పాలనను చేరువ చేయడం, అభివృద్ధి పరుగులు పెట్టించడం, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ధ్యేయంగా కొత్త జిల్లాలో పాలన సాగుతోంది. పాలకొల్లు నియోజకవర్గం భగ్గేశ్వరంలో 64 ఎకరాల్లో రూ.475 కోట్లతో వైద్య కళాశాల, భీమవరంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్లతో 100 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

భీమవరంలోని కలెక్టరేట్ జిల్లాలోని అన్నిప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండటంతో వ్యయప్రయాసలు తప్పాయి. జిల్లాలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ఏడాది కాలంలో 15,423 దరఖాస్తులు రాగా 14,574 అర్జీలను పరిష్కరించారు.

పాలనపై ప్రత్యేక మార్క్

నూతన పశ్చిమగోదావరి జిల్లాకు మొదటి కలెక్టర్‌గా పి.ప్రశాంతి పనిచేస్తున్నారు. ఆమె పాలనలో తనదైన శైలిలో వ్యవహరిస్తున్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను సకాలంలో అందించడంతో పాటు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించారు.

వరదల సమయంలో..

గతేడాది గోదావరికి వరదలు వచ్చిన సమయంలో లంక గ్రామాలు నీటమునగాయి. కలెక్టర్ ప్రశాంతి అధికార యంత్రాంగంతో ఆయా ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను ముమ్మరం చేశారు. నెల రోజులపాటు జిల్లా యంత్రాంగం సమర్థంగా సేవలందించడంతో ఏ ఒక్క ప్రాణానికి హాని కలగలేదు.

స్వగృహ'మస్తు'

జిల్లాలో పేదలకు ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటివరకూ 20 వేల మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకున్నారు. మరిన్ని ఇళ్లు నిర్మాణ దశల్లో ఉన్నాయి. లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు

భీమవరంలోని రాయలంలో రూ.1.60 కోట్లతో బ్లడ్ బ్యాంకును ఏర్పాటుచేశారు. కలెక్టర్ ప్రోత్సాహంతో ప్రభుత్వ ఉద్యోగులు, దాతలు రూ.50 లక్షల విరాళం అందించారు. త్వరలో బ్లడ్ బ్యాంకును ప్రారంభించనున్నారు.

భీమవరం.. సుందర పట్టణం

భీమవరం సుందర పట్టణంగా రూపుదిద్దుకుంటోంది. వెల్‌కమ్ ఆర్చిలు, వాటర్ ఫౌంటెన్లు, వాల్ పెయింటింగ్స్, డివైడర్ల మధ్యలో మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. వ్యాపారవేత్తలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో పట్టణ సుందరీకరణకు కలెక్టర్ కృషిచేస్తున్నారు.

'రియల్'కు మంచి రోజులు

భీమవరం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంది. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. భీమవరంలో కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు అందుబాటులో ఉండటంలో రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. అలాగే రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వానికి మంచి ఆదాయం వస్తోంది.

పెరిగిన హోటళ్ల వ్యాపారం

భీమవరంలో హోటళ్ల వ్యాపారం గణనీయంగా పెరిగింది. గతంలో పట్టణంలో 80 హోటళ్లు ఉండగా ప్రస్తుతం వీటి సంఖ్య 130 వరకు పెరిగింది. కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులతోపాటు జిల్లా నలుమూలల నుంచి వివిధ అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల సంఖ్య పెరగడంతో హోటళ్ల వ్యాపారం పుంజుకుంది.

ఇళ్లు అద్దెలూ..

భీమవరంతోపాటు సమీప గ్రామాలైన విస్సాకోడేరు, తాడేరు, చినఅమిరం, రాయలం తదితర గ్రామాల్లో ఇళ్ల అద్దెలు పెరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుకావడంతో ఉద్యోగుల సంఖ్య పెరిగింది. దీంతో ఇళ్ల అద్దెలు పెరుగుతున్నాయి.

పాలన మరింత చేరువ



జిల్లాల పునర్విభజనతో ప్రజలకు ప్రభుత్వ పాలన మరింత చేరువైంది. సమస్యలను సత్వరమే పరిష్కరించి అభివృద్ధిని వేగం చేయడానికి అవకాశం ఏర్పడింది. పేదలకు నవరత్నాల పథకాలను అందించేందుకు కృషి చేస్తున్నాం. జిల్లా పరిధి తక్కువ విస్తీర్ణంలో ఉండటంతో ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే వెళ్లి పరిష్కరించగలుగుతున్నాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్

సత్వర సేవలందించేలా..



నూతన జిల్లా విస్తీర్ణం తక్కువ, రవాణా సౌకర్యం అనుకూలం, తగినంత పోలీసు సిబ్బంది ఉండటంతో ప్రజలకు సత్వర సేవలందించగలుగుతున్నాం. దీంతో నేరాల సంఖ్య కూడా బాగా తగ్గింది. మారుమూల ప్రాంతాలకు కూడా వెంటనే చేరుకోగలుగుతున్నాం. సారా, గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం.

– యు.రవిప్రకాష్, జిల్లా ఎస్పీ

ఫిర్యాదులపై అలసత్వం తగదు

జిల్లా ఎస్పీ రవిప్రకాష్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: ప్రజల నుంచి వస్తున్న స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ సిబ్బందిని ఆదేశించారు. భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. మోసాలపై ఎనిమిది, కట్న వేధింపులపై ఐదు, వేధింపులపై రెండు, ఆస్తి తగాదాలపై మూడు ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు.

పరీక్షలకు పటిష్ట బందోబస్తు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశామని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. సోమవారం ఏలూరులో పరీక్షా కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. భద్రతా ఏర్పాట్లు, సదుపాయాలు, వైద్య శిబిరాలను పరిశీలించారు. ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని ఎస్పీ అన్నారు. విద్యార్థులు పరీక్షా సమయం కంటే ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, సహాయక సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్లు పరీక్షా కేంద్రంలోనికి తీసుకురాకూడదన్నారు. విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు.

గడువు లోపు అర్జీల పరిష్కారం

కలెక్టర్ పి.ప్రశాంతి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనలో అందిన ప్రతి దరఖాస్తును నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, అర్జీదారులకు సంతృప్తికరమైన సేవలు అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా అధికారులు దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలోనే సమస్యను పరిష్కరిస్తే జిల్లాస్థాయి స్పందనకు అర్జీదారులు రావాల్సిన అవసరం ఉండదన్నారు. మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. రోజూ స్పందనపై పది నిమిషాలు సమయం కేటాయిస్తే ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కారమవుతాయన్నారు. స్పందన కార్యక్రమంలో 152 అర్జీలు వచ్చాయని, వీటన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ జేవీ మురళి, ఆర్డీఓ కె.కృష్ణవేణి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ డి.అఖిల, డీపీఓ ఎం.నాగలత, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- తన భర్త 2021లో గుండెపోటుతో మృతిచెందారని, సహజ మరణానికి ఇచ్చే బీమా పరిహారం అందలేదని తణుకు మండలం వేల్పూరుకు చెందిన నక్కా స్వరూపరాణి అర్జీ అందజేశారు.
- తనకు పుట్టింటి వారు ఇచ్చిన మూడు సెంట్ల స్థలాన్ని తన భర్త అతని పేరు మీదకు మార్చుకున్నాడని, న్యాయం చేయాలని పెన్నాడకు చెందిన చీర వెంకటలక్ష్మి కలెక్టర్‌ను కోరారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న ఇళ్ల నిర్మాణాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. మొదలు పెట్టిన ఇళ్లు తక్కువగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్లలో వారం రోజుల్లోగా లెవెలింగ్ పనులు, రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి మండలంలో వచ్చే వారం నాటికి 280 నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. లేఅవుట్లలో బ్రిక్స్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హౌసింగ్, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉంటూ ఇళ్ల నిర్మాణాలను వేగిరపర్చాలన్నారు. లబ్ధిదారులను కలిసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్డీఓ దాసి రాజు, మండల ప్రత్యేక, హౌసింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

గుడి వివాదంపై విచారణ



గవరవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమణి

సాక్షి ఎఫెక్ట్

కొయ్యలగూడెం: గవరవరం గ్రామ నడిబొడ్డున ఉన్న గంగానమ్మవారి ఆలయ వివాదంపై తహసీల్దార్ పాశం నాగమణి సోమవారం విచారణ చేపట్టారు. 'సాక్షి'లో 'రెవెన్యూ రికార్డుల్లో గుడిమాయం' శీర్షికన ప్రచురించిన కథనానికి ఆమె స్పందించారు. సుమారు రెండు సెంట్ల స్థలంలోని ఆలయాన్ని రికార్డుల్లో చూపించకుండా వీఆర్వో పత్రాలు జారీ చేయడంతో ఓ కుటుంబం రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా నిర్వహించిందని, దీంతో గుడితో పాటు స్థలం కూడా ఆక్రమణకు గురైందని తహసీల్దార్ వద్ద గ్రామ రైతులు ప్రస్తావించారు. మాజీ సర్పంచ్ ఎస్ఆర్ఆర్ నరసింహరాజుతోపాటు రైతు నాయకులతో తహసీల్దార్ విచారణ చేపట్టారు. పూర్తిస్థాయి నివేదికలు తెప్పించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గ్రామస్తులు కోరారు. సింగారపు సాయిబాబు, జవ్వాది శ్రీనివాస్, రాఘవరాజు కృష్ణ, సుబ్బారావు పలివెల, ఆకుల రాము, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

గ్రూప్–4 పరీక్షలకు సర్వం సిద్ధం

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో మంగళవారం నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్–4 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. గ్రూప్–4కు సంబంధించి కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ పరీక్షలను మూడు కేంద్రాల్లో నిర్వహించనున్నామన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరుగుతాయని, ఒక్కో షిఫ్టులో 385 మంది చొప్పున అభ్యర్థులు హాజరవుతారన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజ్, తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కాలేజ్, తాడేపల్లిగూడెం శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–ఇంజనీరింగ్‌లో కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. పరీక్షల సమయం కంటే ముందుగానే ఉదయం 8.45 గంటలకు, మధ్యాహ్నం 1.45 గంటలకు అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. కేంద్రాల వద్ద ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేశామన్నారు. పరీక్ష ముగిసే వరకూ అభ్యర్థులను బయటకు పంపరన్నారు. కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సమన్వయంతో పరీక్షలను విజయవంతం చేయాలని కోరారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ జి.వసంత కుమార్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పి.రమేష్, లైజాన్ ఆఫీసర్లు పి.అనురాధ, కె.ఎలియమ్మ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో కృష్ణవేణి

ఏలూరులో 3 కేంద్రాల్లో..

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో జరుగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్–4 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్ఎస్ మూర్తి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మూడు కేంద్రాల్లో రెండు షిఫ్టుల్లో కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించనున్నారని, జిల్లాలో 710 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని చెప్పారు. ఏలూరు సిద్ధార్థ సీబీఎస్‌సీ స్కూలులో 360 మంది, సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో 160 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కాలేజీలో 190 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. డీఎస్పీ కృష్ణంరాజు, లైజాన్ ఆఫీసర్లు కిరణ్మయి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ఏలూరు (టూటౌన్): చిన్నారులు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించడంలో చిరుధాన్యాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి కేఏవీఎల్ పద్మావతి అన్నారు. స్థానిక 49వ డివిజన్‌లోని యూపీ పాఠశాలలో పోషకాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పద్మావతి మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా 11 మంది గర్భిణులకు సీమంతాలు చేశారు. చిరుధాన్యాలతో పంటల ప్రదర్శన నిర్వహించారు. వెల్ బేబీ షో ఏర్పాటుచేసి బహుమతులు అందించారు. విద్యార్థులకు చిరుధాన్యాలపై వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు.

క్లుప్తంగా

తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్/ఏలూరు(ఆర్ఆర్ పేట): తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కృషి చేయాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి తెలిపారు. ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఏలూరు జిల్లా శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరులో సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సేవలు అభినందనీయమన్నారు. అధ్యక్షులు శ్రీహరికోటి, ఉపాధ్యక్షులు శొంఠియాల కస్తూరిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంవీఆర్ఎస్ శర్మ (గురుశర్మ), మహిళా కార్యదర్శి శ్యామల హరికోటి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం బాసట

- బోధన, శిక్షణ సామగ్రికి బడ్జెట్ కేటాయింపు
- ఉమ్మడి పశ్చిమగోదావరిలో 39 పాఠశాలలకు లబ్ధి



కైకలూరు భవిత కేంద్రంలో బోధన చేస్తున్న ఐఈఆర్టీ (ఫైల్)

కైకలూరు: దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సమగ్ర శిక్ష ద్వారా పరికరాలు అందిస్తున్నారు. విధి వంచించినప్పటికీ విభిన్న ప్రతిభావంతుల్లో మార్పు దిశగా భవిత కేంద్రాలు ఇప్పటికే సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. దీనికి తోడు ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగులకు సైతం పరికరాలు అందించి సృజనాత్మకశక్తిని పెంచడానికి అవసరమైన పరికరాల కొనుగోలుకు బడ్జెట్ కేటాయించారు. బోధన నిమిత్తం ఇప్పటికే ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ డిజేబుల్డ్ సెకండరీ స్టేజ్ (ఐఈడీఎస్ఎస్) ద్వారా స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లను నియమించింది.

రెండు జిల్లాలకు రూ.1.47 లక్షల కేటాయింపు

ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థుల పరికరాల కోసం 2022–23 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలో 235 హైస్కూల్స్‌కు బోధన, శిక్షణ సామగ్రి కొనుగోలు కోసం రూ.18,96,000 నిధులను సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సురేష్‌కుమార్ గురువారం కేటాయించారు. దీని ప్రకారం ఏలూరు జిల్లాలో 29 ఉన్నత పాఠశాలలకు రూ.3 వేలు చొప్పున రూ.87 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో 20 ఉన్నత పాఠశాలలకు రూ.60 వేలు వెరసి రూ.లక్షా 47 వేలు కేటాయించారు. వీటితో దివ్యాంగులకు అవసరమైన మ్యాప్‌లు, ఉడెన్ పజిల్స్, పలకలు, గడియారం క్యాలెండర్లు, వివిధ ఆకృతుల పరికరాలు కొనుగోలు చేయనున్నారు.

భవిత కేంద్రాల్లో ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్స్ (ఐఈఆర్టీ) ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలకు ఇప్పటికే బోధన చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 49 భవిత కేంద్రాల్లో 744 మంది దివ్యాంగులు చదువుతున్నారు. వీరి కోసం 68 మంది ఐఈఆర్టీలు, 40 మంది ఆయాలు, 16 మంది ఫిజియోథెరపిస్టులు పనిచేస్తున్నారు. భవిత కేంద్రాల్లో 8వ తరగతి వరకు బోధన చేసిన తర్వాత ఉన్నత పాఠశాలలకు పంపుతున్నారు. అక్కడ దివ్యాంగులకు 2020 డీఎస్సీ నుంచి ప్రత్యేక శిక్షణ పొందిన స్కూల్ అసిస్టెంట్లు ప్రత్యేక పరికరాలతో బోధన చేయనున్నారు.

ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

బుద్ధి మాంద్యం, పాక్షిక, పూర్తి అంధత్వం, మాట్లాడడంలో లోపం, వినికిడి, అభ్యసన లోపాలు, స్థిరత్వం లేమితో బాధపడుతున్న విద్యార్థులకు భవిత కేంద్రాలు సేవలు అందిస్తున్నాయి. హియరింగ్ ఎయిడ్స్, కాలిబర్స్, వీల్‌చైర్స్, రోలేటర్స్, హ్యాండ్ స్టిక్స్, సీపీ చైర్ వంటి పరికరాలను ఉచితంగా అందిస్తున్నారు. ప్రతి వారం ఫిజియోథెరపీతో పాటు దృష్టిలోపం కలిగిన వారికి బ్రెయిలీ లిపిలో బోధన, చెవిటి, మూగ వంటి సమస్యలు ఉన్నవారికి స్పీచ్ థెరపీ అందిస్తున్నారు. నడక సరిగా రాని పిల్లల కోసం స్టెప్ బార్, వాకింగ్ బార్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో విద్యార్థికి దాదాపు రూ.10 వేలు విలువ చేసే టీఎల్ఎం కిట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది.

ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు



ఇంటర్మీడియట్ వరకు ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ కల్పిస్తోంది. ఇప్పటికే దివ్యాంగుల కోసం పాఠశాలల వద్ద ర్యాంప్, మరుగుదొడ్లు నిర్మించారు. త్వరలో హైస్కూల్ స్థాయిలో 5 కిలోమీటర్లలోపు దివ్యాంగులకు ప్రత్యేక తరగతులు జరగనున్నాయి. ఇందుకు ఇప్పటికే శిక్షణ పొందిన స్కూల్ అసిస్టెంట్లను ప్రభుత్వం నియమించింది. త్వరలో బోధన, శిక్షణ పరికరాలతో తరగతులు జరుగుతాయి. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

– బి.భాస్కరరాజు, ఐఈఆర్టీ జిల్లా కో–ఆర్డినేటర్, ఏలూరు

రక్షణ కల్పించాలంటూ మహిళ మౌనదీక్ష



ఏలూరు కలెక్టరేట్ వద్ద ముగ్గురు పిల్లలతో మౌన దీక్ష చేస్తున్న మహిళ

ఏలూరు (టూటౌన్): ముగ్గురు యువకులు గత కొద్ది కాలంగా తనను హింసిస్తున్నారంటూ ఏలూరు మండలం సుంకరవారితోట ఇందిరా కాలనీకు చెందిన మహిళ లింగాబత్తుల నందిని ఏలూరు కలెక్టరేట్ వద్ద సోమవారం మౌనదీక్ష నిర్వహించింది. తనకు న్యాయం చేయాలని, తనకు రక్షణ కల్పించాలంటూ ఆందోళన చేపట్టింది. తన భర్త లింగాబత్తుల సూరిబాబు అలియాస్ అచ్చయ్య మూడేళ్ళ క్రితం ప్రమాదంలో చనిపోవడంతో స్థానికంగా అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేసుకుని తన ముగ్గురు పిల్లల్ని పోషించుకుంటున్నానని తెలిపింది. తాను గతంలో స్థానిక ఒకటో పోలీస్ స్టేషన్‌లో మొద్దు తంబి, మొద్దు సురేష్, మొద్దు నరేష్‌లపై కేసు పెట్టానన్నారు. దీంతో వారు ముగ్గురు తనపై పగబట్టి వేధిస్తున్నారని ఆరోపించింది. ప్రతి రోజు రాత్రి పూట తాను ఉండే ఇంటి వద్దకు వచ్చి తనను, తన పిల్లల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పింది. ఎస్సీ కులానికి చెందినవారిమని, అట్రాసిటీ కేసు పెట్టి లోపల వేయించేస్తామంటూ బెదిరిస్తున్నారని తనకు రక్షణ కల్పించాలని వేడుకొంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

ఇల్లు ఖాళీ చేయాలంటూ పిన్నిపై దాడి

ద్వారకాతిరుమల: ఇల్లు ఖాళీ చేయాలంటూ పిన్నిని కొట్టిన ఒక వ్యక్తి, అతని భార్యపైన సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని గుణ్ణంపల్లికి చెందిన నక్కా సూర్యనారాయణకు ఇద్దరు భార్యలు. అందులో రెండో భార్య లక్ష్మి పేరున ఆయన ఒక ఇంటిని రాశాడు. ప్రస్తుతం ఆమె ఆ ఇంట్లోనే ఉంటోంది. అయితే సూర్యనారాయణ మృతి చెందిన తరువాత అదే గ్రామానికి చెందిన ఆయన మొదటి భార్య కుమారుడు నక్కా నరసింహరాజు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి ఒక పోర్షన్‌లో ఉంటున్నాడు. ఇదిలా ఉంటే ఈ నెల 1న ఉదయం 7 గంటల సమయంలో ఇల్లు ఖాళీ చేయాలంటూ నరసింహరాజు, అతని భార్య దుర్గాదేవిలు లక్ష్మితో గొడవపడి, ఆమెను కొట్టారు. దాంతో ఆమె గాయపడింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడిచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాండ్రంలో ఐపీఎల్ సంబరం

ఉండి: ఐపీఎల్ ముంబయి ఇండియన్స్ ప్లేయర్ తిలక్‌వర్మ రాణిస్తుండటంతో ఆయన అమ్మమ్మ గ్రామమైన ఉండి మండలం వాండ్రంలో సోమవారం సంబరాలు చేసుకున్నారు. గత మ్యాచ్‌లో ఆర్‌సీబీపై 84 పరుగులు చేయడంతో అమ్మమ్మ, తాతయ్య సుందరమ్మ, సుబ్బరాజు, కుటుంబ సభ్యులు, స్నేహితులు సంబరాలు చేసుకున్నారు.

12 నుంచి శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవాలు

15న రాత్రి స్వామివారి కల్యాణం



కొలువైన శ్రీనివాసుడు



శిల్పకళలతో ఉట్టిపడుతున్న పురాతన ఆలయం



స్వామివారి కల్యాణ మండపం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీనివాసుడి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 12 నుంచి 18 వరకు జరగనున్నాయి. అందులో భాగంగా ఆలయంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 12న స్వామివారిని పెండ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేసి, ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. 13న స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు సర్వాది దేవతలను, రుషులను ఆహ్వానించే క్రమంలో అర్చకులు, పండితులు ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 14న ఎదుర్కోలు ఉత్సవం, 15న రాత్రి ఉభయదేవేరులతో స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా జరుపనున్నట్లు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. 16న సమీప గ్రామమైన తిమ్మాపురంలో స్వామివారికి గరుడోత్సవాన్ని, 17న శ్రీ చక్రవార్యుత్సవం, ఉత్సవాలను వీక్షించిన సర్వాది దేవతలకు, రుషులకు వీడ్కోలు ఇచ్చే క్రమంలో ధ్వజావరోహణను నిర్వహిస్తారు. అలాగే 18న రాత్రి 7 గంటల నుంచి జరుగనున్న ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

ఆలయ చరిత్ర ఇదీ..

ఒకే ఆలయగోపుర గర్భ భాగంలో శ్రీ వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లతో పాటుగా జగన్నాథస్వామి, బలరామ, సుభద్రల సన్నిధి, ఆళ్వారుల సన్నిధి, సంతాన వేణుగోపాల స్వామి సన్నిధి ఉండటం ఈ ఆలయ ప్రత్యేకత. శ్రీవారి క్షేత్రానికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్మీపురం ఆలయాన్ని శతాబ్దంన్నర క్రితం ఒడిశా రాష్ట్రానికి చెందిన పూరీ మఠాధిపతులు మంత్రరత్నం అమ్మాజీ ఇక్కడ నిర్మించారు. ఆమె పూరీ జగన్నాథ మఠాధిపతులు కావడంతో జగన్నాథ స్వామినికూడా ఇక్కడ ప్రతిష్ఠించారు. అనంతరం ఉత్సవాలు జరిపి కైంకర్యం చేయగా కాలక్రమేణా ఆలయం శిథిలమైంది. దాంతో 1992లో ఈ ఆలయాన్ని ద్వారకాతిరుమల దేవస్థానం దత్తత తీసుకుని జీర్ణోద్ధరణ చేసి, అభివృద్ధి చేసింది. ప్రతి ఏటా దేవస్థానం అధికారులు ఈ ఉత్సవాలను ఆలయంలో వైభవంగా నిర్వహిస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న అధ్యాపకులు

కామవరపుకోట: ఆధునిక యుగంలో విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎస్.రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వం మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కోగంటి విజయబాబు ఆధ్వర్యంలో పాపులర్ లెక్చరర్స్ సిరీస్ జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ ప్రస్తుతం బయోటెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణల గురించి విద్యార్థులంతా తెలుసుకోవాలని, నానో బయోటెక్నాలజీ, నానో మెడిసిన్, నానో ఎలక్ట్రానిక్స్, బయో మెటీరియల్ వంటి వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి తాడేపల్లిగూడెం గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.రవీంద్రబాబు, డాక్టర్ సీహెచ్ గుప్తా, డాక్టర్ రామకష్ణ, సాగర్, ఢిల్లేశ్వరావు, ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, డి.మల్లేష్, వి.శ్రీనివాస్, బి.రాజు, ఎ.హర్షవర్ధిని, నజ్మ పాల్గొన్నారు.

కోకో సాగు విస్తీర్ణం పెరగాలి



దక్షిణాది రాష్ట్రాల ఉద్యాన శాఖాధికారుల శిక్షణా కార్యక్రమంలో బ్రోచర్ విడుదల చేస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్ తదితరులు

తాడేపల్లిగూడెం: క్షేత్రస్థాయిలో కోకో దిగుబడి 23 శాతానికి మించడం లేదని.. దేశీయ అవసరాలకు సరిపడా కోకోను పండించడమే లక్ష్యంగా రైతులను కార్యోన్ముఖుల్ని చేయాలని పశ్చిమగోదావరి జిల్లా వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీలో సోమవారం ప్రారంభమైన దక్షిణాది రాష్ట్రాల ఉద్యాన శాఖాధికారుల మూడు రోజుల జాతీయ శిక్షణా కార్యక్రమం ప్రారంభంలో అధికారులు పిలుపునిచ్చారు. డైరెక్టర్ ఆఫ్ క్యాషునట్ అండ్ కోకో డివిజన్ (డీసీసీడి)కొచ్చిన్ సంచాలకులు డాక్టర్ వెంకటేష్, ఎస్.హుబ్బళ్లిలు మాట్లాడుతూ దేశంలో చాక్లెట్ల తయారీకి సరిపడా కోకో గింజలను దేశంలో ఉత్పత్తి చేయలేకపోతున్నాని.. వంద కిలోల గింజలకు 23 శాతం మాత్రమే దిగుబడి వస్తుందని.. నాణ్యమైన గింజలను పండించలేక పోతున్నారని చెప్పారు. రైతులకు కోకో పంటలో మేలైన దిగుబడులు సాధించడానికి అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణను ఏర్పాటుచేశామన్నారు. గింజల ధర క్రమేపీ పెరిగినా సాగు విస్తీర్ణం పెరగడంలేదన్నారు. ముఖ్యఅతిథి ఉద్యానవర్సిటీ ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్ మాట్లాడుతూ కోకోకి వాణిజ్యపరమైన డిమాండ్ అధికంగా ఉన్నప్పటికి , ఉత్పత్తి తక్కువగా ఉంటుందన్నారు. నాణ్యమైన మొక్కలు, డిమాండ్‌కు తగినంతగా అందుబాటులో లేకపోవడం వల్ల ఈ సమస్య వచ్చిందన్నారు. దక్షిణ భారతంలోని కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఏపి, తెలంగాణ రాష్ట్రాలలో కోకో విస్తీర్ణం కనపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీసీసీడి కొచ్చిన్ సహకారంతో తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట, శ్రీకాకుళం జిల్లా పెదపేటలలో అధునాతన కోకో నర్సరీలు నూతనంగా ఏర్పాటుచేయబోతుందన్నారు. ఏలూరు జిల్లా విజయరాయిలో ఉన్న కేంద్రాన్ని కొచ్చిన్ సహకారంతో విశిష్ట ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కోకో సాగుపై ఉద్యానవర్సిటీ ప్రచురించిన మాన్యువల్‌ను ఆవిష్కరించారు. ఉద్యాన పరిశోధన స్థానం డాక్టర్ బి.శ్రీనివాసులు, విస్తరణ సంచాలకులు ఈ.కరుణశ్రీ, డాక్టర్ అశోక్, డాక్టర్ మాధవీలత, డాక్టర్ అపర్ణ, డాక్టర్ సునీత పాల్గొన్నారు.

భీమవరం అభివృద్ధికి కలిసి రావాలి



భీమవరంలో పార్క్ ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం అభివృద్ధికి ప్రతి ఒక్కరిలో సంకల్పం రావాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. రూ.1.50 కోట్లతో బీవీ రాజు ఫౌండేషన్ భీమవరంలో ఆధునికీకరించిన వీరమ్మ చెరువును సోమవారం కలెక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టరు మాట్లాడుతూ భీమవరాన్ని నూతన జిల్లాగా ప్రకటించినప్పుడు రోడ్లు, డ్రైనేజీలు సక్రమంగా లేవని ఇప్పుడు ప్రభుత్వం రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి చేసిందని చెప్పారు. భీమవరాన్ని బాగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా అందరూ అనుకుంటారని, కానీ భీమవరం అంతగా అభివృద్ధి చెందలేదని విశాలమైన రోడ్లు , డ్రైనేజీలు, పార్కులు లేవని అన్నారు. విద్యాపరంగా అభివృద్ధి చెందిందని, ధనికులు ఎక్కువగా ఉన్నప్పటికీ కూడా భీమవరంలో రోడ్లు డ్రైనేజీలు పార్కులు అభివృద్ధి చెందలేదని అన్నారు. భీమవరం అభివృద్ధికి అందరం సాయం చేయాలని, మన ప్రాంతాలలో రోడ్లు, డ్రైన్లు శుభ్రంగా ఉంచుకోవాలని.. పార్కులకు వచ్చినప్పుడు చెత్తా చెదారం వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వీరమ్మ చెరువును అభివృద్ధి చేయడం చూసిన కొంత మంది ఎడ్వర్డ్ పార్కు, సోమగుండం పార్కులను అభివృద్ధి చేయడానికి ముందుకు వస్తున్నారని, అదే విధంగా మిగిలిన దాతలు కూడా ముందుకు వచ్చి వివిధ ప్రాంతాల్లో ఉన్న పార్కులను కూడళ్లను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కలెక్టరు పి.ప్రశాంతి కోరారు. బీవీ రాజు ఫౌండేషన్ చైర్మన్ కె.విష్ణు రాజు మాట్లాడుతూ 22 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఈ పార్కు కొంత కాలం తర్వాత నిర్వహణ లోపం వల్ల శిథిలావస్థకు చేరిందని అన్నారు. ఇప్పుడు జిల్లా కలెక్టర్ సూచనలతో పార్కును రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. వీరమ్మ చెరువును ఐదు సంవత్సరాల పాటు నిర్వహించేందుకు బీవీ రాజు ఫౌండేషన్‌కు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు అందజేశారు. అనంతరం పార్కులో కలెక్టరు ఇతర అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో భీమవరం ఆర్డీవో దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ యస్.శివరామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలకు కేబుల్ కనెక్షన్లపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్

కొయ్యలగూడెం: విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుల్ కనెక్షన్లపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఏపీ ఈపీడీసీఎల్ అధికారులకు జంగారెడ్డిగూడెం డీఈ సర్క్యులర్ జారీ చేసినట్లు రాష్ట్ర వినియోగదారుల కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఏఆర్కే హనుమంతరావు పేర్కొన్నారు. సాక్షిలో మార్చి 26వ తేదీ 'కేబుల్ వైర్లతో ప్రజలకు సమస్యలు' శీర్షికపై డీఈ స్పందించినట్లు హనుమంతరావు తెలిపారు. అనధికారికంగా విద్యుత్ పోల్స్‌కు కనెక్షన్లను అమర్చిన నేపథ్యంలో విద్యుత్ శాఖ రెంటల్ చార్జీలు వసూలు చేయాలని ఆదేశించారన్నారు. ఇప్పటివరకు రెంటల్ చార్జీలు చెల్లించకపోవడం పట్ల కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వానికి చెందాల్సిన ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న కేబుల్ నిర్వాహకుల చర్యలను తన దృష్టికి (918309789845) తీసుకురావాలని హనుమంతరావు సూచించారు.

ఘనంగా సామూహిక సీమంతాలు

ఏలూరు (టూటౌన్): స్థానిక 50వ డివిజన్ పరిధిలోని ఎంఆర్‌సీ కాలనీ, భరత్ నగర్ 47, 48 అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. చిరుధాన్యాల వాడకం, మిల్లెట్స్, రాగులు, కొర్రలు, జొన్నలు, సజ్జలు, సాములు, గంట్లు వీటి ద్వారా ఆహారం ఎలా తయారు చేసుకోవాలో తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్‌కు గాయాలు



డీసీఎం వ్యాన్‌ను ఢీకొన్న టిప్పర్ లారీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డులో డీసీఎం వ్యాన్‌ను, టిప్పర్ లారీ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో క్లీనర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైజాగ్ నుంచి మెడిసిన్ తీసుకుని హైదరాబాద్ వెళుతున్న డీసీఎం వ్యాన్‌ను ఆదివారం అర్ధరాత్రి జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డులో పక్కన నిలిపి డ్రైవర్ పడుకున్నాడు. తెల్లవారుజామున కొయ్యలగూడెం వైపు నుంచి జంగారెడ్డిగూడెం వస్తున్న టిప్పర్ లారీ డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో టిప్పర్ లారీలో ఉన్న క్లీనర్ అజయ్‌కుమార్ కాలికి గాయమైంది. అతనిని 108 వాహనంలో ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఎస్సై ఎం.సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్టు

కొయ్యలగూడెం: అత్యాచారం కేసులో చొప్ప రామన్నగూడెంకు చెందిన పెనుగొండ సతీష్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ సోమవారం పేర్కొన్నారు. వేదాంతపురం గ్రామానికి చెందిన బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. తన కుమార్తెపై సతీష్ అత్యాచారానికి పాల్పడ్డాడని ఆమె ఫిర్యాదు చేసింది.

క్లుప్తంగా

పోషకాహారంతో రక్తహీనత దూరం



ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఇరగవరం: మండలస్థాయి పోషణ పక్వాడా కార్యక్రమం సోమవారం ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించినట్టు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎన్ కాంతకుమారి, మాణిక్యం బి, నాగలక్ష్మి తెలిపారు. చిరు ధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. రక్తహీనత, ఐరన్ లోపం వంటివి అరికట్ట వచ్చని తెలిపారు. ఈ కార్యక్రయంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, దినేష్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, కార్యదర్శి వై ముని రాజు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో సరస్వతి, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు

పెంటపాడు: స్త్రీ, పురుషులలో వివాహ వయస్సు నిర్ధారణ చేయకుండా ఒత్తిడికి లోనై బాల్య వివాహాలు చేసే నిర్వాహకులైె చట్టపర మైన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీవో టీఎల్ సరస్వతి, మండల తహసీల్దార్ జీవీ శేష గిరిరావు పేర్కొన్నారు. పెంటపాడు మండల సమావేశ మందిరంలో సోమవారం బాల్యవి వాహాలపై ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి పాస్టర్లు, పురోహితులు, ఇమామ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో స్త్రీల వయస్సు 18, పురుషుల వయస్సు 21 దాటేలా చూడాల న్నారు. ఆధార్ కార్డులు సరిచూసుకోవా లన్నారు. చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వై జర్లు సీహెచ్ దుర్గా భవాని, కె. దుర్గాభవాని, పెంటపాడు పీహెచ్‌సీ సుజాత, పెంటపాడు ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీల్లో సూర్యహంసినికి కాంస్యం

సాక్షి, భీమవరం: కేలో ఇండియా కాంపౌండ్ ఉమెన్ నేషనల్ ర్యాంకింగ్ విలువిద్య అండర్-17 సబ్‌జూనియర్ పోటీల్లో భీమవరం పట్టణానికి చెందిన మాదాల సూర్యహంసిని కాంస్య పతకం సాధించింది. హర్యానాలోని సోనిపట్‌లో ఈనెల 2వ తేదీన నిర్వహించిన పోటీల్లో సూర్యహంసిని ఢిల్లీకి చెందిన తని స్కభాటియాపై విజయం సాధించిందని ఏపీ స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ సోమవారం చెప్పారు. క్రీడాకారిణి సూర్యహంసిని సత్యనారాయణ, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జయరాజు, కోచ్ కమల్‌కిషోర్ అభినందించారు.

కలెక్టరేట్‌లో క్యాంటీన్ ఏర్పాటు

భీమవరం(ప్రకాశం చౌక్): కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ డ్వాక్రా సంఘాల ద్వారా నూతన క్యాంటీన్ ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్న సందర్భంగా ఈ నూతన క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ వేణుగోపాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నూతన క్యాంటీన్‌ను డ్వాక్రా సంఘానికి అప్పగించామన్నారు. క్యాంటీన్‌లో టీ, టిఫిన్, భోజనం, డ్వాక్రా సంఘాల ద్వారా తయారవుతున్న స్వీట్లు తదితర అందుబాటులో ఉంటాయన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లాలి

ఆకివీడు: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న రోజుల్లో కూడా ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి మద్దతు పలికారు. మండలంలోని చిన్నమిల్లిపాడులో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. జేసీఎస్ ఇన్‌చార్జి పుప్పాల పండు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ రాష్ట్ర అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఇంటికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. పథకాలు ప్రగతికి దోహదపడుతున్నాయని ప్రజలే చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ గురుదాస్ సీత బాలాజీ, పలువురు వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీకి చర్యలు

ఆకివీడు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సాయి ట్రస్ట్ ఒడిశా ఆధ్వర్యంలో గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించనున్నట్లు సంస్థ కో-ఆర్డినేటర్ పువ్వాడ రాజా అమర్నాథ్ చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా పౌష్టికాహార కిట్లను అందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం మండలాల్లో కో-ఆర్డినేటర్లు, గ్రామాలలో వలంటీర్లను నియమించామన్నారు.

లక్ష్య సాధన దిశగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం

- ఇళ్ల నిర్మాణంలో తణుకు మండలం ద్వితీయ స్థానం
- పేదల సొంతింటి కల సాకారం



తణుకు మండలం దువ్వలోని జగనన్న కాలనీలో ఆప్షన్ -3లో నిర్మించిన ఇళ్లు

తణుకు టౌన్: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జిల్లాలో మొదటి విడతలో నిర్దేశించిన లక్ష్య సాధనలో తణుకు మండలంలో 98 శాతం ప్రగతి సాధించారు. గతంలో ఏప్రభుత్వం చేపట్టని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇంటి పట్టాలు అందించి, వాటిలో గృహ నిర్మాణాలు చేపట్టారు. దీనిలో భాగంగా మార్చి నెలాఖరునాటికి రాష్ట్రవ్యాప్తంగా 3.70 లక్షల గృహాలను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో 10రోజులపాటు గృహ నిర్మాణ లబ్ధిదారులకు బిల్లులు ఆలస్యం కావడంతో లక్ష్యాన్ని ఏప్రిల్ 14కు మార్చారు. ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 3.70 లక్షల గృహాలను నిర్మాణం లక్ష్యం కాగా జిల్లాలో 71,854 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో మార్చి 31 నాటికి జిల్లాలో ఉండి నియోజకవర్గంలోని కాళ్ల మండలం 1,057 గృహాలు మంజూరు కాగా వాటిలో 1,050 గృహాలు నిర్మాణం పూర్తి చేసి జిల్లాలో ప్రథమస్థానంలో నిలవగా తణుకు మండలంలో మొత్తం 3,587 ఇళ్లు మంజూరుకాగా వాటిలో మొదటి విడతలో మొత్తం 906 గృహాల నిర్మాణం చేపట్టారు. వాటిలో 888 ఇళ్లనిర్మాణం పూర్తిచేసి జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు అధికారులు వివరించారు. జిల్లాలో మొత్తం జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహాల నిర్మాణంలో తణుకు మండలంలోని నిర్మాణాల వేగంగా ఎక్కువగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం గృహాల నిర్మాణాల్లో ఆప్షన్ 1, 2, 3లో ఆప్షన్ 3 నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. తణుకు మండలంలో ఆప్షన్ 3లో మొదటి విడతలో చేపట్టిన 300 గృహాల నిర్మాణం దాదాపు పూర్తయినట్టు వివరించారు. లబ్ధిదారుల కోరిక మేరకు ప్రత్యేక ఏజెన్సీ ద్వారా చేపట్టిన ఆప్షన్ 3 గృహ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యాయి. జగనన్న కాలనీలో నిరుపేదలకు ఆప్షన్‌గృహాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ గృహాల నిర్మాణాలకు డ్వాక్రా స్వయం సహాయక సంఘాలద్వారా రూ.35వేల ఆర్థిక సహాయంతో పాటు జాతీయ ఉపాధి హామీ పథకంలో 20రోజులపాటు వేతనాలను బిల్లులో చెల్లిస్తున్నారు.

నూరు శాతం సాధిస్తాం



నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో అర్హులై ఇంటి పట్టా పొందిన వారందరికీ ఇళ్లు నిర్మించుకునే విధంగా జగనన్న లేవుట్లలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేసింది. దానితో లబ్ధిదారులు ముందుకు వచ్చి తమ ఇళ్లను నిర్మించుకున్నారు. చాలామంది గృహ ప్రవేశాలు చేశారు. ఇప్పటికే మండలంలో 98 శాతం ప్రగతి సాధించాం. అంబేద్కర్ జయంతి నాటికి నూరు లక్ష్యాన్ని సాధిస్తాం.

– వెలగల వెంకటరెడ్డి, హౌసింగ్, ఏఈ తణుకు

ఆప్షన్ 3 నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ



గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారి కోసం ఆప్షన్ 3లో చేపట్టిన ఇళ్ల నిర్మాణంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాం. అర్హులైన పేదలకు సొంతిల్లు అందించాలనే లక్ష్యంతో నాణ్యతతో కూడిన ఇళ్లను ప్రత్యేక ఏజెన్సీ ద్వారా ఆప్షన్ 3 ఇళ్లను నిర్మిస్తున్నాం. ఇదే స్ఫూర్తితో మలి విడతలో మరిన్ని గృహాలను పేదలకు నిర్మించి అందిస్తాం.

– పీ శ్రీనివాసరావు, డీఈ, ప్రత్యేక అధికారి, తణుకు మండలం

సొంతింటి కలను నిజం చేసిన ప్రభుత్వం



రాష్ట్రంలో ఇళ్లులేని పేదలకు సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు ద్వారా నిజం చేశారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు నాయుడు ఒక్క సెంటు భూమి కూడా పేదలకు అందించలేదు. ముఖ్యంగా తణుకు వంటి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఇళ్లులేని పేదలు తమ ఆదాయంలో ఎక్కువ ఇంటి అద్దెలకే కేటాయించి ఇబ్బందులు పడుతున్నారు. అర్హులందరికీ సొంతింటి పట్టాలను అందించాం. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో దశల వారీగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నాం.

– కారుమూరి వెంకటనాగేశ్వరరావు, రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి

సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



సంపూర్ణ పోషణపై పీహెచ్‌సీ వద్ద ర్యాలీ చేస్తున్న ఆరోగ్య, ఐసీడీఎస్ అధికారులు

పెంటపాడు: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే పరమావధిగా వైద్య, ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖల నిత్య దినచర్య కావాలని ఐసీడీఎస్ సీడీపీవో టీఎల్ పద్మావతి పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా 15 రోజులుగా స్త్రీ శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ అభియాన్ పక్వాడా కార్యక్రమాన్ని సోమవారం ముగించారు. ఈ సందర్భంగా పెంటపాడు పీహెచ్‌సీలో సమీక్షించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. పెంటపాడు పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గాభవాని, కె. దుర్గా భవాని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.తహసీల్దార్ జీవీ శేషగిరిరావు మాట్లాడుతూ పోషణ, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు సిబ్బంది కృషి చేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తోట రాజేష్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. సీహెచ్‌వో సుజాత మాట్లాడుతూ కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేకశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఎన్‌ఎం, ఆశ, హెల్త్ సబ్ కమిటీలు ఉమ్మడి గృహ సందర్శనల ద్వారా రక్తహీనతకు గురైన వారిని గుర్తించాలన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది, పెంటపాడు ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

- కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు
- విద్యార్థుల వెంట వచ్చిన తల్లిదండ్రులు



తాడేపల్లిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు



పెదతాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ఎస్సై వీరభద్రరావు



తణుకు జెడ్పీ బాలుర హైస్కూలు వద్ద పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు



తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి పరీక్షా కేంద్రంలోకి వస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థినీ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు రావడంతో కోలాహలంగా మారింది. ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం కేటాయించిన రూంలకు పంపారు. తాడేపల్లిగూడెం టౌన్, మండలం, పెంటపాడు పరిధిలో 17 ప్రభుత్వ, జెడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలలో తెలుగు పరీక్ష నిర్వహిస్తుండగా 3,423 మంది పరీక్షలు 3,363 మంది హాజరయ్యారు. 60 మంది పరీక్షలకు హాజరు కాలేదు.

ఐదు కేంద్రాల్లో పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి, కడియద్ద, కొమ్ముగూడెం, మాధవరం, ఆరుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో సోమశారం ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఐదు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,110 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. 9 గంటలకు విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి, పరీక్షా కేంద్రాల్లోకి అనుమతినిచ్చారు. అనంతరం విద్యార్థులు హాల్ టిక్కెట్లు, రూమ్ నంబర్లను పరిశీలించుకుని పరీక్షా కేంద్రాల్లోకి చేరుకున్నారు. 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైంది. పరీక్షా కేంద్రం వద్ద జీఎంఎస్‌కే, పోలీస్ కానిస్టేబుల్ బందోబస్తు నిర్వహించారు. పెదతాడేపల్లి, కొమ్ముగూడెం, కడియద్ద, మాధవరం, ఆరుగొలను జిల్లా పరిషత్ హైస్కూలులో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు పరిశీలించారు. వారి వెంట ఆర్ఐ కె.శివప్రసాద్, వీఆర్వో ఆర్.పోతురాజు, పంచాయతీ ఈవో టి.రవిచంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్, హెల్త్ సిబ్బంది ఉన్నారు.

పెంటపాడు మండలంలో...

పెంటపాడు: పెంటపాడు మండలంలోని పలు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో 749మంది విద్యార్థులకు సోమవారం పరీక్షలకు 740మంది హాజరైనట్లు ఎంఈవో ఎం. శ్రీనివాస్ తెలిపారు.

తణుకు డివిజన్‌లో మొదటి పరీక్షలకు 101 మంది గైర్హాజరు

తణుకు టౌన్: పదో తరగతి పరీక్షలు తణుకు డివిజన్‌లోని (డివిజనల్ విద్యాశాఖాధికారి పరిధిలో) 8మండలాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తణుకు డివిజనల్ పదో తరగతి విద్యార్థులు మొత్తం 6,569 మంది విద్యార్థులకు 6,468 మంది సోమవారం పరీక్షలకు హాజరైనట్లు డీవైఈవో ఆర్ వెంకటరమణ తెలిపారు. మొదటి రోజు పరీక్షలకు డివిజన్ పరిధిలో మొదటి రోజు పరీక్షలకు మొత్తం 101 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. ఆచంట మండలంలో నలుగురు, అత్తిలిమండలంలో 8మంది, యలమంచిలి మండలంలో 9 మంది, ఇరగవరం మండలంలో 17 మంది, పెనుగొండ మండలంలో 19 మంది, పెనుమంట్ర మండలంలో 22 మంది, పోడూరు మండలంలో 8మంది, తణుకు మండలంలో 14మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు తెలిపారు.

17 మంది గైర్హాజరు

ఇరగవరం: ఇరగవరం, తూర్పువిప్పర్రు, రేలంగి మూడు సెంటర్లలో మొత్తం 464 మంది పదో తరగతి విద్యార్థులకు 447 మంది పరీక్షలకు హాజరయ్యారని, 17 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో ఎస్ శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

తణుకు జెడ్పీ బాలుర హైస్కూలు వద్ద సందడి

తణుకు అర్బన్: పదో తరగతి పరీక్షలు తణుకులో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. తణుకు మునిసిపాలిటీ, మండలానికి సంబంధించి మొత్తం 11 కేంద్రాల్లో 2,309 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 14 మంది గైర్హాజరుతో 2,295 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

దివ్యాంగులకు ఉపకరణాల అందజేత



మాట్లాడుతున్న జిల్లా దివ్యాంగుల పిల్లల సహాయ సమన్వయ కర్త పి.శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాల ఆవరణలో సోమవారం ప్రపంచ ఆటిజం డే ను నిర్వహించారు. సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.శ్యాం సుందర్, జిల్లా దివ్యాంగుల పిల్లల సహాయ సమన్వయ కర్త పి.శ్రీనివాసరావు హాజరయ్యారు. తొలుత అవసరమైన దివ్యాంగుల పిల్లలకు ఉపకరణాలు అందజేశారు. దివ్యాంగుల పిల్లలను ప్రతి రోజు పాఠశాలకు పంపించి ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుకోవాలని అధికారులు సూచించారు.

క్రీడాపరికరాలు అందజేత

సుబ్బారావుపేట భవిత పాఠశాల ఆవరణలో దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా సభ్యురాలు వైట్ల గజలక్ష్మి విద్యార్థులకు క్రీడా సామగ్రి, డ్రాయింగ్ బుక్స్, బిస్కెట్లు, బాక్సులు అందజేశారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు బాలీశ్వరయ్య, కనకదుర్గ, ప్రభావతి, ఇందిరా కుమారి, రామలక్ష్మి, అరుణ కుమారి, వీఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

స్పందనలో రెండు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు వచ్చాయని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకర్ సోమవారం చెప్పారు. దుంపగడప గ్రామంలో అనుమతులు లేని రొయ్యల చెరువుకు విద్యుత్ కనెక్షన్ ఏ విధంగా మంజూరు చేశారని, కనెక్షన్ నిలుపుదల చేయాలని సూరంపూడి వెంకట రాంబాబు, అద్దేపల్లి ప్రభాకర్ ఫిర్యాదు చేశారని చెప్పారు. కుప్పనపూడి గ్రామంలో తన సొంత స్థలంలో ఇతర వ్యక్తులు కలగజేసుకుని అబద్ధపు సాక్షాలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామానికి చెందిన రాట్నాల ఉమా ఫిర్యాదు చేశారని చెప్పారు.

సాంకేతిక అంశాలపై నైపుణ్యం అవసరం



ఆశలకు అవగాహన కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలులో సిబ్బందికి సాంకేతిక అంశాల్లో నైపుణ్యం అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో సోమవారం ఆశా డేను నిర్వహించి అవగాహన కలిగించారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు వీకర్స్ కాలనీ, బీవీ సెంటర్, కడకట్ల, యాగర్లపల్లి అర్బన్‌హెల్త్ సెంటర్‌లలోని వైద్యాధికారులు డాక్టర్లు ఎస్.అమృత, కే.లత, చైతన్య, శ్రావ్య హాజరయ్యారు. కీటక జనిత వ్యాధులు, నియంత్రణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయిలో సిబ్బంది చేయాల్సిన వివిధ కార్యక్రమాలు, నిర్దేశించిన లక్ష్యాలు తదితర విషయాలను వెల్లడించారు. క్లీన్ ఏపీగా తీర్చిదిద్దేందుకు చేయాల్సిన కార్యక్రమాలను, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు చేయాల్సిన పనులను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆశా నోడల్ పర్సన్ వారూనిక, సుజాత, ప్రసన్న, ఆరోగ్య సహాయకులు ప్రసాద్ బాబు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని 33/11 కేవీ హౌసింగ్ బోర్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ రిలయన్స్ ఫీడర్‌కు సంబంధించి మరమ్మతులు నిమిత్తం ఈ నెల 4వ తేదీ మంగళవారం విద్యుత్ సరఫరాను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం వెల్లడించారు. సత్యవతి నగర్‌లోని చెట్లు రోడ్డు, ఏరియా ఆసుపత్రి, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

శ్రీరామ నామస్మరణతో మార్మోగిన బొండాడ

కాళ్ల: శ్రీరామ నామస్మరణతో బొండాడ గ్రామం మార్మోగింది. గ్రామంలో భద్రాద్రి శ్రీరామచంద్రస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ఊరేగింపు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లను వివిధ మేళతాళాలతో, చిత్ర విచిత్ర వేషధారణతో, బాణసంచా కాల్పుల నడుమ భక్తిశ్రద్ధలతో భారీ ఊరేగింపు కన్నుల పండుగగా జరిగింది. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు రోడ్లపై బారులు తీరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు



చినతాడేపల్లిలో రైతులకు నవధాన్యాలు ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: నవధాన్యాలు భూమిలో చల్లుకోవడంవల్ల తక్కువ ఖర్చుతో భూసారాన్ని పెంపొందించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు అన్నారు. సోమవారం మండలంలోని చినతాడేపల్లిలో నవధాన్యాలు విత్తనాల ప్యాకింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి మాట్లాడుతూ సిబ్బంది అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ రైతులందరినీ ప్రకృతి వ్యవసాయంలో తీసుకురావాలన్నారు. అనంతరం 30 రకాల విత్తనాలతో తయారు చేసిన 500 కిట్లను కావలసిన రైతులకు అందజేశారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు యూనిట్లకు సంబంధించి జిల్లా కోఆర్డినేటర్ గద్దె వెంకటరత్నం, తాడేపల్లిగూడెం డివిజన్ ఇన్‌ఛార్జ్ ధర్మ, రెడ్డి రాధిక, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విష్ణు విద్యార్థుల ప్రతిభ

సాక్షి, భీమవరం: జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు సోమవారం చెప్పారు. ఈనెల 1న ప్రకాశం జిల్లా ఒంగోలులోని రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు అభినందించారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

పెంటపాడు: అలంపురంలో తక్షణమే అర్హత ఉన్న వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘు జిల్లా ప్రధాన కార్యదర్శి కళింగ లక్ష్మణరావు కోరారు. ఈ సందర్భంగా సోమవారం పెంటపాడు తహసీల్దార్ కార్యాలయంలోని లబ్ధిదారులతో నిరసన తెలిపారు. 2019లో ఇళ్లులేని పేదలకు 73 మందికి ఒకటిన్నర సెంట్ భూమి చొప్పున ఇచ్చారన్నారు. కానీ భూమి లే అవుట్ చేసి ఇవ్వలేదన్నారు. ఈ విషయంపై తక్షణం వారిని లే అవుట్ చేసి భూమి ఇవ్వాలన్నారు. తహసీల్దార్ జీవీ శేషగిరికి వినతి పత్రం సమర్పించారు.

వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా సీతారామ్

కాళ్ల: వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా కాళ్లకూరు వీఆర్వో నిట్టల సీతారామ్ ఎన్నికయ్యారు. తహసీల్దార్ కార్యాలయంలో భీమవరం డివిజన్ అధ్యక్షుడు కేడీఎస్ కెనడీ సమక్షంలో సోమవారం కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా సీతారామ్, ఉపాధ్యక్షుడిగా పెదఅమిరం వీఆర్వో గుర్రం చిట్టిబాబు, కార్యదర్శిగా ఏలూరుపాడు వీఆర్వో కోమటి సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా సీసలి వీఆర్వో బి.రాజేష్, సహ కోశాధికారిగా ప్రాతాళ్లమెరక వీఆర్వో ఎం.ప్రశాంత్‌బాబును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎన్నికైన నూతన కమిటీని పలు గ్రామాల వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది అభినందించారు.